మొక్కలు విరివిగా నాటుదాం..

- పర్యావరణ దినోత్సవ కార్యక్రమాల్లో వక్తలు
- పర్యావరణాన్ని రక్షిస్తామని ప్రతిజ్ఞ

విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని పలువురు వక్తలు పేర్కొన్నారు. కాలుష్యం పెరిగిపోతున్న ఈ తరుణంలో మొక్కలు నాటి సంరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని సూచించారు. అడవులు తరిగిపోతున్నాయని, విషపూరిత వాయువులు గాలిలో కలిసి కాలుష్యభరితమవుతోందని, ముఖ్యంగా ప్రతి ఇంట్లో నుంచి వెలువడుతున్న క్లోరో ఫ్లోరో కార్బన్‌లు (సీఎఫ్‌సీ) పర్యావరణానికి చేటుచేస్తున్నాయని వివరించారు. వీటన్నింటి నుంచి కాపాడుకోవాలంటే తప్పనిసరిగా మొక్కలు నాటాలని కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలతోపాటు అన్ని చోట్ల నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మొక్కలు నాటారు. పర్యావరణాన్ని కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.

-సాక్షి నెట్‌వర్క్


పాల్వంచరూరల్: కిన్నెరసాని డీర్ పార్కు వద్ద మొక్కలు నాటుతున్న అధికారులు, విద్యార్థులు


పాల్వంచ: మొక్కలు నాటుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్


సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ప్రధాన కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు


జూలూరుపాడు: ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, సిబ్బంది


సింగరేణి(కొత్తగూడెం): కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో అధికారుల ర్యాలీ


ఇల్లెందురూరల్: ఎంపీడీఓ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది


పాల్వంచరూరల్: మండల పరిషత్ ఆఫీస్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది


ఇల్లెందురూరల్: జీడీసీలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పోలారపు పద్మ


ఇల్లెందు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ తదితరులు

క్లుప్తంగా

కటకం సుదర్శన్‌కు ఘన నివాళులు

సింగరేణి(కొత్తగూడెం): విప్లవోద్యమంలో అడుగు పెట్టి, సుమారు 48 ఏళ్లు సింగరేణి ఏరియాల్లో విప్లవోద్యమం నడిపించిన కటకం సుదర్శన్, అలియాస్ రమాకాంత్ ఎందరికో స్ఫూర్తి అని ఇఫ్టూ జిల్లా కార్యదర్శి నెమిళ్ల సంజీవ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఇఫ్టూ కార్యాలయంలో పలు కార్మిక సంఘాల ఆధర్యంలో కటకం సుదర్శన్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బెల్లంపెల్లి ప్రాంతంలో జన్మించిన ఆయన రాడికల్ స్టూడెంట్ యూనియన్‌ను నడిపించారని, సింగరేణి కార్మిక సంఘం (సికాస)ను ఏర్పాటు చేశారన్నారు. 2002లో సికాస ఆధ్వర్యంలో 36 రోజుల సమ్మె కాలంలో కార్మికుల సమస్యలను యాజమాన్యంతో చర్చించి పరిష్కరించిన నేత అని కొనియాడారు. కార్యక్రమంలో గొని నాగేశ్వరరావు, తోడేటి నాగేశ్వరరావు, మల్లికార్జున్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌ఎఫ్ అధ్యక్షురాలిగా కమలారాణి


గుర్తింపు కార్డులు అందజేస్తున్న దాస్

కొత్తగూడెంటౌన్: నేషనల్ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌ఎఫ్) జిల్లా అధ్యక్షురాలిగా చుంచుపల్లికి చెందిన కొచ్చర్ల కమలారాణి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొత్తగూడెంనకు చెందిన కె.చంద్రమౌళి నియమితులయ్యారు. కొత్తగూడెంలో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం నిర్వహించగా సోమవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి.దాస్ వివరాలు వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, విధిగా మొక్కలను నాటాలని సూచించారు.


మృతులకు సంతాపం

కొత్తగూడెంటౌన్: రెండు రోజుల కిందట ఒడిశాలోని బాలాసోర్ వద్ద జరిగిన రైలు ప్రమాదంలో మరణించిన 289 మందికి కొత్తగూడెం న్యాయవాదులు సోమవారం సంతాపాన్ని తెలిపారు. కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్‌కుమార్‌మక్కడ్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు హాల్లో జరిగిన సమావేశంలో రైలు ప్రమాద మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో దుంద్ర రమేశ్, రావిలాల రామారావు, సాహూ సంతోష్‌లాల్, పిట్టల రామారావు, యాసా యుగంధర్, ఎ.మనోరమ, వి.రాజేశ్వరరావు, రేపాక వెంకటరత్నం, పలివెల గణేశ్‌బాబు, అనుబ్రోలు రాంప్రసాద్ రావు, ఎంఎస్ఆర్ రవిచంద్ర, జె.పద్మారావు తోపాటు పలువురు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలా... ప్రచార వేదికలా?

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో జరిగిన తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకలు ఎన్నికల ప్రచార కార్యక్రమాలను తలపించాయని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ ఆరోపించారు. తెలంగాణ వచ్చాక ఓసీలను రద్దు చేస్తామని, స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పిన కేసీఆర్ ఆ హామీలేవీ నెరవేర్చలేదని పేర్కొన్నారు. ఆరుగాలం కష్టించే కార్మికులకు వేడుకల్లో ప్రాధాన్యత ఇవ్వలేదని ఆరోపించారు. అలాగే, సింగరేణి మైదానాలను బీఆర్ఎస్ ప్రచార వేదికల్లా మార్చినా అధికారులు అడ్డుకోకపోవడం సరికాదని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

యువ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా ప్రదీప్


నియామకపత్రం అందిస్తున్న సత్యనారాయణ

చుంచుపల్లి: బీజేపీ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా జోగు ప్రదీప్‌కుమార్ నియమితులయ్యారు. జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయనకు పార్టీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ నియామకపత్రం అందజేసి మాట్లాడారు. పార్టీ సిద్ధాంతాలను వివరిస్తూ యువత పార్టీలోకి వచ్చేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్‌తో పాటు పైడిపాటి రవీందర్, హరిహరస్‌యాదవ్, రాజా, విజయ్, ప్రవీణ్, కిరణ్ పాల్గొన్నారు.

స్వచ్ఛ డ్రైవర్లకు సన్మానం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీలో పనిచేసే స్వచ్ఛ ఆటోడ్రైవర్లను ఐటీసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. ప్రపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా డీఆర్‌సీసీ కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ రవి, ఆటో డ్రైవర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయాలని నిరసన



చుంచుపల్లి: నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

చుంచుపల్లి/కొత్తగూడెంఅర్బన్: మహిళా రెజ్లర్ల విషయంలో అసభ్యంగా ప్రవర్తించిన బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయాలని కోరుతూ సోమవారం భారత్ బచావో ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని పోస్టాఫీస్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకొని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రెజ్లర్లు చేస్తున్న పోరాటాన్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో భారత్ బచావో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మల్లెల రామనాథం, బార్ కౌన్సిల్ అధ్యక్షులు రమేశ్‌కుమార్‌మక్కడ్, అబ్దుల్ భాసిత్, హబీబ్, తాండ్ర వెంకటేశ్వర్లు, చారువాక, జేబీశౌరి, భూక్య రమేశ్, లక్ష్మి, మోతుకూరి మల్లికార్జున్‌రావు, గొని నాగేశ్వరరావు, నబీసాహెబ్, కూసపాటి శ్రీనివాస్, బిక్కులాల్, రమేశ్‌నాయక్, మంగీలాల్‌నాయక్, ప్రశాంత్, కురిమల శంకర్, వేల్పుల భాస్కర్, రియాజ్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో..

కొత్తగూడెంఅర్బన్: అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పతకాలు సాధించి భారత కీర్తి పతాకను విశ్వవ్యాప్తం చేసిన భారత రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన భారత రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌శరణ్‌సింగ్‌ను అరెస్టు చేయాలని, అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి డిమాండ్ చేశారు. రెజ్లర్ల పోరాటానికి మద్దతుగా సోమవారం సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు. బి.కిషోర్‌సింగ్, ఎస్.కృష్ణ, వి.వరలక్ష్మి, బి.మురళిమోహన్, ఎస్.వెంకటేశ్వర్లు, ఇ.హతిరాం, ఎం.పద్మారాణి, బి.బిక్కు.డి, దాసు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదుత్పత్తి, వినియోగంలో అగ్రగామి

- నిరంతర విద్యుత్ సరఫరాతో సకల జనులకు ఉపయోగం
- ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ


ర్యాలీగా వస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ఇల్లెందురూరల్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే అంధకారం తాండవిస్తుందని నాడు ఉమ్మడి రాష్ట్ర పాలకుల విమర్శలు తప్పని నిరూపిస్తూ నేడు విద్యుదుత్పత్తి, వినియోగంలో తెలంగాణను సీఎం కేసీఆర్ అగ్రగామిగా నిలిపారని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. తెలంగాణ దశాబ్ది వేడుకల్లో భాగంగా మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామ శివారులోని ఎస్ఎస్ ఫంక్షన్‌హాల్లో విద్యుత్ ప్రగతి విజయోత్సవ సభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాటి పాలకులు వనరులను సద్వినియోగం చేసుకోవడంలో విఫలం చెందడం వల్లే కరెంట్ కష్టాలు వచ్చాయని, ప్రస్తుతం సీఎం కేసీఆర్ ప్రణాళికాబద్ధంగా అవే వనరులను సద్వినియోగం చేసుకుంటూ విద్యుదుత్పత్తిని గణనీయంగా పెంచారని చెప్పారు. విద్యుత్ ఉద్యోగుల శ్రమను ఎవరూ మరిచిపోవద్దని, వారి అంకితభావం, పట్టుదల వల్లే సీఎం కేసీఆర్ కలలు సాకారమయ్యాయని స్పష్టం చేశారు. సభలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, పీఏసీఎస్ చైర్మన్‌లు లక్కినేని సురేందర్, మెట్టెల కృష్ణ, సర్పంచ్ చీమల వెంకటేశ్వర్లు, ట్రాన్స్‌కో డీఈలు భద్రుపవార్, కిషన్, ఏడీఈ కోటేశ్వరరావు, ఏఈలు రాము, రవి, సుమన్, దేవా, బుజ్జికన్నయ్య, నర్సింహారావు తోపాటు ఆంగోత్ బిందు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల ర్యాలీ

పాల్వంచ: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కేటీపీఎస్ కాంప్లెక్స్ పరిధిలో పట్టణంలో విజయోత్సవ ర్యాలీని సోమవారం సాయంత్రం నిర్వహించారు. అంబేడ్కర్‌సెంటర్‌లో కేటీపీఎస్ 5, 6, 7 దశల కర్మాగారాలకు చెందిన ఉద్యోగులు చేరుకున్నారు. తెలంగాణ తల్లి విగ్రహానికి సీఈలు ఎం.ప్రభాకర్‌రావు, పి.వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేఎస్‌పీరోడ్ మీదుగా ర్యాలీ నిర్వహించారు.

ఎంపీ బాపూరావు క్షమాపణ చెప్పాలి


కొత్తగూడెంటౌన్: వినతిపత్రం ఇస్తున్న పాస్టర్లు

టేకులపల్లి: ఆదిలాబాద్ ఎంపీ బాపూరావు పాస్టర్లపై బుల్లెట్లు దింపుతామని చేసిన అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తున్నామని, ఆయన వెంటనే క్రైస్తవులకు క్షమాపణ చెప్పాలని పాస్టర్స్ సంఘం జిల్లా నేత బల్లెం చిట్టిబాబు డిమాండ్ చేశారు. సోమవారం బేతంపూడిలోని పాస్టర్ సంధ్యారాణి చర్చిలో మండల పాస్టర్ల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పాస్టర్ల నూతన కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా బల్లెం జాన్‌రాజ్, ఉపాధ్యక్షుడిగా రాజు, కోశాధికారిగా హనోకు, పిల్లి అబ్రహం, బోయాజులను ఎన్నుకున్నారు.

ఎంపీపై చర్యలు తీసుకోవాలి

కొత్తగూడెంటౌన్: క్రైస్తవులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆదిలాబాద్ ఎంపీ బాపూరావుపై కఠిన చర్యలు తీసుకోవాలని యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆఫ్ కొత్తగూడెం సభ్యులు సోమవారం కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్‌కు వినతిపత్రం అందజేశారు. పాస్టర్లు సందీప్, నాని, మోజెస్ మాట్లాడారు. మత ఘర్షణలను రెచ్చగొట్టే అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. యేసు ప్రసాద్, ఇర్మియా, తిమోతి, జాన్‌క్రిస్టఫర్ పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో శ్రమదానం

పాల్వంచరూరల్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో సోమవారం ఉద్యోగులు, సిబ్బంది శ్రమదానం నిర్వహించారు. ఆలయ ప్రాంగణం, పీహెచ్‌సీ భవనంలోని చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఈఓ ఎస్.రజనీకుమారి, ఆలయ కమిటీ అధ్యక్షులు మహిపతి రామలింగం, ధర్మకర్తలు గంధం వెంగళరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో ప్లాస్టిక్‌ను బహిష్కరించాలని ఈఓ సూచించారు.

రేపు భక్తులు, దాతలతో సమావేశం

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 7వ తేదీన పెద్దమ్మతల్లి ఆలయంలో భక్తులు, దాతలతో సమావేశం నిర్వహించనున్నట్లు ఈఓ ఎస్.రజనీకుమారి తెలిపారు. వివిధ అభివృద్ధి పనుల కార్యక్రమాలపై భక్తులు, దాతలతో ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తామన్నారు.


శ్రమదానం చేస్తున్న ఈఓ, ఆలయ సిబ్బంది

గణేశ్ టెంపుల్‌లో..

కొత్తగూడెంటౌన్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీవిజయ విఘ్నేశ్వర స్వామి (గణేశ్ టెంపుల్) ఆలయంలో అర్చకులు, సిబ్బంది, భక్తులు శ్రమదానం నిర్వహించారు. ఆలయ ఈఓ సులోచన ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రం చేశారు. విగ్రహాలను తుడిచి, ఆలయంలోని మొక్కలకు నీరు పోశారు.

వీధి వ్యాపారులకు గొడుగులు పంపిణీ


గొడుకు పరిశీలిస్తున్న డీవీ

ఇల్లెందు: రోడ్ల వెంట చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వారికి గొడుగులు అందజేశారు. ఇల్లెందులోని ప్రధాన రహదారులపై చిరువ్యాపారులకు చేతన ఫౌండేషన్ సమకూర్చిన గొడుగులను మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అందజేసి మాట్లాడారు. ఫౌండేషన్ సభ్యులు భూక్యా సత్తులాల్, మనోహర్, సత్యనారాయణ, మెరుగు కార్తీక్ యాదవ్, కలవల సుధాకర్ పాల్గొన్నారు.

ఘనంగా చైర్మన్ జన్మదిన వేడుకలు

ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్మికులతో పాటు 10వ వార్డులో మెరుగు కార్తీక్ యాదవ్ ఆధ్వర్యాన కేక్ కట్ చేశారు.

కాంగ్రెస్ నుంచి నరసింహారావు సస్పెండ్

టేకులపల్లి: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు గుండా నర్సింహారావును పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య దేవానాయక్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ, మండల అధ్యక్షుడిగా తనకు తాను ప్రకటించుకుని, బీఆర్ఎస్ పార్టీకి కోవర్టుగా పని చేస్తున్నందున సస్పెండ్ చేశామని వివరించారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

సుజాతనగర్: గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించకుండా వేడుకలు నిర్వహించడం ఏమిటని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రా కామేశ్ ప్రశ్నించారు. మండలంలోని సర్వారం గ్రామ పంచాయతీ పరిధి ఒడ్డుగూడెంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తగూడెంలో 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ లేక చిన్నపాటి వర్షం, గాలులకే అంతరాయం ఏర్పడుతోందన్నారు. నాయకులు గంధం మల్లికార్జున్ రావు, పాయం శారద, భూక్యా కోటేశ్, భూక్యా దేవరాజ్, బానోత్ సాయికిరణ్, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

ఏం చేశారో చెప్పండి..

జూలూరుపాడు: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఏం చేసిందో చెప్పాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బట్టు ప్రసాద్, కందగట్ల సురేందర్ డిమాండ్ చేశారు. సోమవారం జూలూరుపాడులో నిర్వహించిన ఏఐకేఎంఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. అనంతరం ఏఐకేఎంఎస్ జూలూరుపాడు, సుజాతనగర్ మండలాల కార్యవర్గాలను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మంచినీళ్ల భాస్కర్, ఉపాధ్యక్షులుగా బత్తుల గోపి, వల్లోజి రమేశ్‌ను ఎన్నుకున్నారు.

ఆశ వర్కర్లకు వేతనాలు పెంచాలి


పాల్వంచరూరల్: ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు


ఇల్లెందు: వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు

పాల్వంచ/పాల్వంచరూరల్: ఆశ వర్కర్లకు పరీక్షను వెంటనే రద్దు చేయాలని, పారితోషికం రూ.18 వేలు పెంచాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు దొడ్డా రవికుమార్, పట్టణ కన్వీనర్ కె.సత్య డిమాండ్ చేశారు. స్థానిక శేఖరంబంజర, జగన్నాథపురం, ఉల్వనూరు పీహెచ్‌సీల వద్ద సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశవర్కర్లు ధర్నా చేపట్టారు. ఆరోగ్య కేంద్రంలో నిరసన వ్యక్తం చేసి, ఆస్పత్రి సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేస్తున్న ఆశ వర్కర్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వారితో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని ఆరోపించారు. 12న చేపడుతున్న జిల్లా కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమణ, సుజాత, యశోద, స్వరూప, రమాదేవి, పద్మ, బుజ్జి, అన్నపూర్ణ, అరుణ, పార్వతి, జ్యోతి, మరియమ్మ, రమణ, పద్మ, బుజ్జి, అన్నపూర్ణ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించండి..

ఇల్లెందు: అనేక ఏళ్లుగా ఆశ వర్కర్లు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్ఏ నబీ, చీమల రమణ, టి.కృష్ణ ఆరోపించారు. సోమవారం ఇల్లెందు సీహెచ్‌సీలో వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 12న తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సునీత, మల్లీశ్వరి, లక్ష్మి, ఉపేంద్ర, స్వప్న, సుశీల, సుగుణ, చంద్రకళ, విజయ, మైమ పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలపై ఆరా

సుజాతనగర్: మండలంలోని గరీబ్‌పేట గ్రామంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశానికి సోమవారం వెళ్లిన బీజేపీ నాయకులు కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో డ్రైయినేజీ లేదని, డబుల్ బెడ్‌రూం, వితంతు పింఛన్లు రాక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ మాట్లాడుతూ కూలీల సమస్యలు పరిష్కరించాలని, బీసీ బంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల నాగేశ్వరరావుగౌడ్, నాయకులు నరేంద్రబాబు, వంశీ, మారుతి వెంకన్న, వీరయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

అటెన్షన్ ప్లీజ్

వంతెన కట్టండి సారూ..



టేకులపల్లి మండలం శంభునిగూడెం ముర్రేడు వాగుపై హైలెవల్ బ్రిడ్జి లేకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. శంభునిగూడెం నుంచి బొమ్మనపల్లిలో హైస్కూల్‌కు వెళ్లే విద్యార్థులు నిత్యం నీటితో ఉండే వాగు దాటేందుకు సాహసం చేయాల్సి వస్తోంది. ఈ మార్గంలో బొమ్మనపల్లికి మూడు కిలోమీటర్ల దూరం ఉండగా.. చుట్టూ తిరిగితే పది కిలోమీటర్లు ఉంటుంది. దీంతో ముర్రేడు వాగుపై బ్రిడ్జి నిర్మిస్తే బొమ్మనపల్లి, కొత్తగూడెం, భద్రాచలం ప్రాంతాలకు విద్య, ఉద్యోగ నిమిత్తం వెళ్లే శంభునిగూడెం, గుండ్లమడుగు, గోప్యాతండా, చంద్రుతండా, సూర్యాతండా వాసులకు దూరభారం తప్పుతుంది.

–టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : కోట వీరబాబు, ఎంపీడీఓ, టేకులపల్లి

సెల్ నంబర్ : 92814 79238